# రాజు

(భారతి : 1931 ఆగష్టు)

## (1)

**పూ**ర్వం సుధర్ముడనే రాజు ఉండేవాడు. ఆయన మహాకర్మిష్ఠి. ప్రొద్దున కోడి కుయ్యటంతోనే లేచి ముఖప్రక్షాళనాదికములు చేసికొని యోగబలం చేత ఆకాశమార్గాన వారణాసి వెళ్ళి అక్కడ మణికర్ణికాఘట్టంలో స్నానం చేసి మళ్ళీ యింటికి వచ్చి ప్రొద్దు తిరిగేదాకా తపస్సు చేసుకొని పార్థివం చేసి భోంచేసేవాడు. బిల్హణుడు చెప్పినట్లు ఆయన యింటిలోని అవిచ్ఛిన్నాగ్నిహోత్రం నుండి వచ్చే పొగలకి ఊదరపెట్టినట్లయి ఏ దోమల్లేనో వున్న కలి మటుమాయమై పోయినది. కావ్యాలు వ్రాస్తూ వున్నవాళ్ళు ఆయన రాజ్యంలో కలి లేదని చెప్పటమే కాని, ఆ శబ్దము యొక్క ఆ శ్రవణము వల్లా ఆ స్థితి వల్లా తత్పూర్యంలో కలి అనేది లేదని.

ఇట్లా ఆ రాజు రాజ్యం చేస్తోంటే వర్ణాలు, ఆశ్రమాలూ చక్కగా నడచినై. వసంతకాలంలో వడగాడ్పులూ లేవు. నడివేసంగిలో వర్షాలు లేవు. పిచ్చికలు పరిగ ఏరుకు తిన్నవిగాని గుంపులు కట్టి చేలమీదికి దాడి వెడలలేదు. ఆ రోజుల్లో కాకులు మఱ్ఱిపళ్ళమీదనే బ్రతికేవి. వడ్లు ఎండబోసుకుంటే నడాన కాకీకలు గ్రుచ్చనక్కర్లేదు.

ఆ సాయమూ ఆ సంధ్యమూ అగ్నిహోత్రం దగ్గర కూర్చున్న బ్రాహ్మడు క్షత్రియుడి రాజ్యాంగంలోనూ చేయి పెట్టలేదు. శూద్రుడి మేడికోలా లాక్కోలేదు. ఏ మగనాలి నవ్వులూ వీధిలో తోరణాలు కట్టలేదు.

వర్షాలకోసం కప్పల్ని ఊరేగించలేదు. గ్రహణాలప్పుడు పళ్ళాలల్లో నీళ్ళోసి రోకళ్ళు నిలబెట్టలేదు. ఆ రాజ్యంలో వ్యాజ్యాలు లేవు. తీర్పులూ లేవు. ఇట్లా రోజులూ, నెలలూ, సంవత్సరాలూ, యుగాలూ గడచిపోయినై. ఒక రోజున ఆ రాజు రాజ్యంలో ఒక క్షత్రియుడు గుఱ్ఱాన్ని యెక్కి ఒక కాపు పొలం దున్నుకుంటూంటే అట్లా వెళుతున్నాడు. ఆ కాపు ఎడ్లని ఆపి ఆ యుద్ధవీరుడి వంక చూశాడు. చూసి చూసి తలత్రాళ్ళు మేడికోలకు కట్టి క్షత్రియుడి దగ్గఱకు వెళ్ళి అన్నాడు – "అబ్బాయీ! నీవు చాల రోజులుగా యీ గుఱ్ఱాన్ని ఎక్కటం,

ఈ కత్తి పుచ్చుకోటం చూస్తున్నాను. నేనెన్నాళ్ళని యీ దున్నటం? ఇహ యిక్కణ్ణుంచి నువ్వు దున్ను, నేను గుఱ్ఱాన్నెక్కుతా"–క్షత్రియుడికి కోపం వచ్చింది. కోపం ఆపుకుని – "నీవు యుద్ధం చెయ్యలేవు. నేను దున్నాలేను. అట్లా చేసినా బాగా కుదరవు. నీవు పోయి దున్నుకో" అన్నాడు.

**కాపు :** మహా నువ్వే యుద్ధం చేస్తావు లెద్దూ. అలవాటయితే సరి, యెవరు పడితే వారే చేస్తారు.

**క్షత్రి :** నిజమే. మఱి నా అంత అలవాటు నీ కెప్పటికి కాదు కనుక ఎవరి పని వారు చేస్తే బాగుంటుంది.

ఈ తగాదా తెగింది కాదు. పదమంటే పదమని యిద్దరూ రాజు దగ్గరకు బయలుదేరారు.

రాజుగారు ఆ రోజుని యెవ్వో విఘ్నాలు వచ్చి కాశీకి వెళ్ళలేదు. దూరంగా వీళ్ళిద్దరూ గంటుపెట్టిన మొగాలతో గుండెల్లోనూ, కళ్ళల్లోనూ రోషాలు పెట్టుకొని వస్తోంటే చూశాడు. చూట్టంతోనే సంగతి తెలిసింది.

ఆయన వాళ్ళిద్దరికీ యెదురుంగా పోయి "అబ్బాయీ! మీ తగాదా నాకు తెలుసు. నేను చాలారోజులు రాజ్యం చేశాను. ఇంక నేను అడవికి వెళుతున్నాను. మీ తగాదా మీ క్రొత్త రాజుతో చెప్పుకొండి" అని వెనక్కి తిరిగి చూడకుండా అడవికి వెళ్ళాడు.

**(2)**

ఆయన కొడుకు ధర్ముడు రాజ్యానికి వచ్చాడు. ఈ తగాదా ఆయన దగ్గరగా వచ్చింది. ఆయనకేమీ పాలుపోక వేదవేదాంగ పారంగతులూ, నిత్యాగ్నిహోత్రులూ అయిన బ్రాహ్మల్ని పిలిపించి వారికి నివేదించాడు. వారు తపోదృష్టితో చూచి "అబ్బాయి! అట్లా వీలులేదు. ఎవరిపని వాళ్ళు చెయ్యాల్సిందే. మీరు పోట్లాడకోకూడదు" అన్నారు. రాజు వారి మాటలతో తనకు కూడా దివ్యదృష్టి కలిగి వారన్నట్లే అన్నాడు. వాళ్ళు ఎవరిదారిన వాళ్ళు వెళ్ళారు.

ధర్ముడు రాజ్యం చెయ్యడం మొదలు పెట్టాడు. ఆయనకు రోజూ కాశీ వెళ్ళటానికి యోగశక్తి చాలక తన రాజధానిని తీసుకెళ్ళి సిప్రానది వొడ్డున

కట్టించుకొని అక్కడే స్నానం చెయ్యటం, అగ్నిహోత్రం చేసుకోవటం, రాజ్యం పాలించుకోవటం మొదలుపెట్టాడు.

ఇట్లాగే మళ్ళీ అప్పుడప్పుడు తగాదాలు రావటం మొదలుపెట్టినై. ఆ బ్రాహ్మణుల్నే పిలిపించి రాజు వాళ్ళ చేత తీర్పు చెప్పించుతూ వచ్చాడు. రాజ్యం మొత్తం మీద సుధర్ముడి రాజ్యమల్లేనే నడిచింది. బ్రాహ్మణులకు మట్టుకు అగ్నిహోత్రాల మధ్య రాచకార్యాల మధ్యా తిరుగట మయ్యింది. ఇట్లా చాలయేళ్ళు గడచినై.

ఒకానొక రోజున నొక బ్రాహ్మడు యూపదారువు తెచ్చుకుందామని కొడుకుని వెంటతీసుకొని అతనికి వేదం చెప్పుకుంటూ పూర్వపు పొలం కాపు దున్నుతున్న పొలం గట్టునే పోతున్నాడు. అప్పటికి ప్రొద్దు వాటారు తోంది. కాపు దున్నిదున్ని అలసిపోయి, చెమటపట్టి చెయ్యి మేడికోల మీంచి జారిపోతూంది. కాపు బ్రాహ్మణ్ణి చూశాడు. ఇట్లా అనుకొన్నాడు. "ఆ బ్రాహ్మడు చూడు ఎంత ఎఱ్ఱగా వున్నాడో! నా వొళ్ళు సూర్యుడి వేడికి నల్లపడ్డది. ఆయన సుఖంగా ఇంట్లో కూర్చుంటోంటే దబ్బపండులా వున్నాడు. దున్ని దున్ని నా రెక్కలు విరిగిపోతున్నై. ఇక నేను దున్నలేనబ్బా! ఎల్లకాలం ఒక్కడు దున్నటం ఎల్లాగేమిటి" అనుకొని ఆయన దగ్గఱకు వెళ్ళి "ఏమండీ! నే నీ పొలం చాల నాళ్ళుగా దున్నుతున్నాను. ఇంక నాకు శక్తిలేదు. నేను మీకు మల్లే వేదాలు చదువుతాను. మీరీ పొలం దున్నండి" అన్నాడు. బ్రాహ్మడు నివ్వెరపోయినాడు. "అబ్బాయి! దానికేమి? నేను ఏదైనా చేస్తాను. నీవైనా, నేనైనా రాజు చెయ్యమన్నది కదా చెయ్యాలి. అతని దగ్గఱకు పోయి ఆసంగతి కనుక్కుందాం రా" అన్నాడు. ఇద్దరూ కదిలి రాజాంతఃపురం దిక్కు నడిచారు. రాజు, ధర్మమూర్తి కొల్వుతీర్చి కూర్చున్నాడు. ప్రక్కనే ప్రాడ్వివాకులూ కూర్చున్నారు.

ఈ బ్రాహ్మణుడూ, కాపూ వెళ్ళారు. బ్రాహ్మణుడు రాజును చూచి - "మేమిందుకొచ్చాము. ఇదీ సందర్భం" అన్నాడు. రాజు ప్రాడ్వివాకుల వంక తిరిగి చూచాడు. యోగదృష్టి పెడతిరిగిందా అన్నట్లు వారి కళ్ళ చివరలు చెక్కిళ్ళ మీదికి వ్రాలినై. ప్రయత్నం మీద దృష్టి భ్రుకుటికి లగించి, వారు "అట్లా కాదు. ఎవరి పని వారు చేయవలసినదే" నన్నారు. రాజు కూడా అట్లాగే నన్నాడు.

బ్రాహ్మణుడు కాపుని చూచి "సరేనా" అన్నాడు. కాపు అన్నాడు "అయ్యా! నాకు న్యాయం జరుగలేదు. ఈయనా బ్రాహ్మడే. వారూ బ్రాహ్మలే. అందుచేత వారి తీర్పు ఇక్కడ పనికిరా"దన్నాడు.

రాజు "అట్లాకాదు. వారి తీర్పు తీర్పుమాత్రమే; అట్లా చెప్పింది నేనేను. నా బుద్ధికీ అంతే తోచింది. ఇంక వెళ్ళు" అన్నాడు.

కాపు 'మహారాజా! మీ అచ్ఛమైన బుద్ధివారి బుద్ధిమూలంగా కలుషితమైంది. మీరు మళ్ళీ విచారించాలి' అన్నాడు.

రాజు తటాలున లేచి నిల్చొని 'నేను అడవికి వెళ్ళే వేళయింది. ఈ సంగతి తరువాత రాజుతో చెప్పుకోండి' అని కిరీటం, భుజకీర్తులూ, ఖడ్గం, సింహాసనం మీద పెట్టి అడవికి నడచి వెళ్ళాడు.

**(3)**

ఆయన కొడుకు ధర్మరాజు రాజ్యానికి వచ్చాడు. మళ్ళా ఆయన దగ్గరికి ఈ తగాదా వచ్చింది. ఆయనా ప్రాడ్వివాకులను అడిగాడు. వాళ్ళు పూర్వపు తీర్పే చెప్పారు. కాపు మళ్ళీ ఆ పూర్వపు అభ్యంతరం చెప్పాడు. రాజు కాపుని ఒప్పుకోమన్నాడు. కాపు ఒప్పుకోనన్నాడు. రాజు ఖడ్గం చూపించి ఒప్పుకోక తప్పదన్నాడు. కాపు వెళ్ళిపోయినాడు. మళ్ళీ రోజులు ఇట్లా గడిచినై. ప్రతిదానికీ రాజు ఖడ్గం చూపించాల్సి వచ్చింది. క్రమంగా రాజ్యంలో వ్యాజ్యాలూ ఎక్కువయినై. రాజు కూడా విసుగుపుట్టి ఎన్నిసార్లని ఖడ్గం చూపిస్తామని ఒక్కొక్కప్పుడు ఖడ్గాన్ని చూపించడం మానివేశాడు. ఎప్పుడు రాజు ఖడ్గం చూపించలేదో అప్పుడు రాజు తమ వేపు నున్నాడని లోకం మాటిపోవటం మొదలెట్టింది.

ఈ రాజుకి ముగ్గురు కొడుకులున్నారు. పెద్దవాడి పేరు సుధర్ముడు. రెండవవాడి పేరు ధర్ముడు. మూడవవాని పేరు ధర్మరాజు, తండ్రిపేరు కొడుకు పేరూ ఒకటేమిటని యితన్ని 'రాజు' అన్నారు.

తన పెద్దకొడుకైన సుధర్ముడు తాతగారల్లే రాజ్యం బాగుచేస్తాడని యీ ధర్మరాజుకి ఆశ. రోజులు గడుస్తున్నై.

రాజుకి కొన్ని తెలిసీ కొన్ని తెలియకుండా రాజ్యంలో మార్పులు జరుగుతున్నై. బ్రాహ్మణులు కొందరు పొలాలు దున్నుతున్నారు. కాపులు కొందరు

వేదాలు చదువుతున్నారు. క్షత్రియులు యుద్ధాలు మానేరు. వైశ్యులు మాత్రం మిగిలారు.

వ్యాజ్యాలు, తగాదాలు, పితూరీలు రోజురోజుకు పెరిగిపోయినై. ఎప్పటికప్పుడు లెక్కలు వ్రాయించి వాటి వైనమంతా తాటాకుల్లో నిలవచేయించారు. క్రొత్తవేవయినా వస్తే రాజు విచారిస్తాడు. కాని ప్రాతమోస్తరు తగాదాలయితే ఆ తాటాకులు తిరగెయ్యటం, తీర్పు అందులోకి మల్లే చెప్పటం, రాజుకీ కష్టం ఎక్కువైనందుకు యిందుకు కొందర్ని నియమించాడు. వారు తాటాకుల్లో ఒక మోస్తరుగా వుంటే వీరు యింకో మోస్తరుగా చెప్పటం మొదలుపెట్టారు. దేశంలో మరికొంత ధర్మం ఈ ప్రకారంగా బయలుదేరింది.

రోజుకు రోజు పోను రాజు దగ్గరికి విషమవ్యాజ్యాలు రావటం మొదలుపెట్టినై. రాజుకా వ్యాజ్యాలు అర్థం కాలేదు సరికదా, అటువంటి వ్యాజ్యాలు వచ్చేందుకు, అట్లాంటి పరిస్థితులు ఎట్లా కలిగినయ్యో కూడా తెలియలేదు. చివరకు కనుక్కుంటే తన ధర్మాధికారులు చేసిన తాటాకు పుస్తకాల వ్యాఖ్యానాల వల్ల అని తేలింది.

రాజు దీర్ఘంగా విచారించాడు. మళ్ళీ రాజ్యం పూర్వం మోస్తరుగా చెయ్యటం అసంభవం అని తెలిసింది. తన తాత తండ్రులకి మల్లే అడవికి పోదామా అనుకున్నాడు. ఇంతలో రాజుకి పెద్ద రుగ్మత ఒకటి సంభవించి దానితో కొన్నాళ్ళు మంచంపట్టి మరికొన్నాళ్ళకి గతించాడు. తండ్రికి నిత్యకర్మ చేసిన పదునాలుగు రోజులూ సుధర్ముడి దగ్గఅకు రోజుకు వందా, వెయ్యి వ్యాజ్యాలు తయారయినై. ఆయన అన్నీ నిలువచేసి కర్మ అయిన తరువాత చూస్తానన్నాడు.

## (4)

కర్మ అయిన తరువాత ఒకరోజున కొలువు తీర్చాడు. మొదటి వ్యాజ్యమిది.

ఒక బ్రాహ్మణ స్త్రీ యందు బ్రాహ్మణొకడు, శూద్రుడొకడు, ఇద్దరు కొడుకులును కన్నారు. ఆ బ్రాహ్మడికి ఊరి పౌరోహిత్యం ఉంది. ఈ శూద్రుడికి రెండెకరాలు కొండ్ర ఉంది. వాళ్ళిద్దరూ పౌరోహిత్యం, కొండ్రా రెండూ దానికిచ్చి

చచ్చిపోయినారు. ఈ కుఱ్ఱవాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. బ్రాహ్మడికి పుట్టినవాడికి పొలము దున్నుదామని వుంది. శూద్రుడికి పుట్టినవాడికి పౌరోహిత్యం చేద్దామని ఉంది. కాని యీ శూద్రుడు తన పొలం పుట్రా వదలిపెట్టనంటాడు. ఆ బ్రాహ్మడు వ్యాజ్యం తెచ్చాడు. వాడికి పొలమూ పౌరోహిత్యము ఎల్లా వస్తయి అని.

సుధర్ముడీ వ్యాజ్యము విని తెల్లబోయినాడు. చుట్టుపట్ల నందరూ 'అయ్యా! ధర్మం చెప్పాల్సింది' అన్నారు. సుధర్ముడు "ఈ సంగతి ధర్మానికి అతీతమయిన విషయం. ఈ ధర్మం నా తరువాత రాజు చెపుతాడు. మా నాయనగారు అడవికి పోదామనుకున్నాడు. కాని వెళ్ళలేకపోయినాడు. ఆయన బదులు నేను వెళ్ళాలి" అని ధర్మాసనం వదిలిపెట్టి అడవికేసి వెళ్లాడు.

**(5)**

ఆయన తరువాత ఆయన తమ్ముడు ధర్ముడు రాజ్యానికి వచ్చాడు. ఈ వ్యాజ్యము యథాప్రకారముగా ధర్ముడి దగ్గరకు తీర్పుకు వచ్చింది. ధర్ముడికి దానిలోని ధర్మాధర్మాలు తెలియలేదు. సరే, రేపు చెపుతా అని వాయిదా వేసాడు.

ఆ రాత్రి యిట్లా ఆలోచించాడు. "ఇందు ధర్మనేమిటి? వీడి పొలం వాడికెట్లా వస్తుంది? వాడి పౌరోహిత్యం వీడికెట్లా వస్తుంది? ఈ బ్రాహ్మణుడు పొలం దున్నటం ఏమి ధర్మం? ఈ శూద్రుడికి పౌరోహిత్యం ఎల్లా చెల్లుతుంది? వీళ్ళ తండ్రులు నిజంగా బ్రాహ్మణ శూద్రులేనా? అయితే వీళ్ళ కిట్లా విపరీత బుద్ధులెల్లా కలిగినై? ఒక స్త్రీయందు వీరిద్దరికిని సంతానమేమిటి? వీరి సర్వవృత్తాంతమూ అధర్మమయంగా ఉంది. వారి తల్లితండ్రుల యధర్మం అట్లా పెట్టి, వీరికి ఆస్తి విభాగం చేద్దామా అంటే వీళ్ళు ఎవళ్ళెవళ్ళకి పుట్టారో నిర్ణయమెట్లాగా? సాక్షుల ద్వారా చేద్దామా, సాక్షులు నిజము చెప్పుదురని విశ్వాసమెల్లాగా?"అని ఆలోచించి ఆలోచించి, ఏమీ తెగక, "ఏ సంగతీ నా బుద్ధి నిర్ణయించలేనప్పుడు, నాకు ధర్మము ఇదీ అని గట్టిగా తెలియనపుడు నేను రాజ్యం చెయ్యటం ఎందుకు? నేను రాజుగా వుండటానికే తగను. మహాతపశ్శక్తి వల్ల ఏ మహానుభావులకు నిజం తెలుస్తుందో, ఎవడి బుద్ధి ధర్మనిర్ణయంలో నిస్సందేహంగా వుంటుందో, రాజు వాడు " అని నిర్ణయించుకొని అర్థరాత్రి వేళ లేచి యెవరికీ చెప్పకుండా యెక్కడికో లేచి ధర్ముడు వెళ్ళిపోయినాడు.

మఱునాడు ప్రొద్దున రాజుకోసం అందరూ వెదికారు. వారం పదిరోజులు తిరిగిన చోటు తిరక్కుండా వెతికిన చోటు వెతక్కుండా చూశారు. రాజు లేడు సరే, రాజు పోయినాడంటే పోయినాడనుకొని ఆయన తమ్ముడు 'ధర్మరాజు'ని (అనగా 'రాజు' అన్నవానిని) రాజుగా చేశారు.

**(6)**

'రాజు' రాజవటంతోటే దేశమంతా చక్కగా మాటిపోయింది.

ఆ వ్యాజ్యం 'రాజు' వద్దకి వచ్చింది. అందరూ అన్నారు. "అయ్యా! ఈ ధర్మం నిర్ణయించలేక మీ పెద్దన్నగారు అడవికి లేచిపోయినారు. చిన్నన్నగారు ఎవరితో చెప్పకుండా పరారి అయినారు. తమరు చెప్పాలి. లేకపోతే దేశంలో ధర్మం వుండదు" అని.

రాజు పగలబడి నవ్వాడు. అన్నాడు కదా "ఛీ ఛీ ! ఈ మాత్రానికా, వాడొక పెద్దన్నా, వీడొక దద్దన్నానూ, మీరు నన్నే మొదట రాజుని చేస్తే ఈ గోల వుండేదా! ఇదిగో చూడండి. ఈ ధర్మం రెండు విధాలుగా ఉంది. చూచుకోండి.

మొదటిరకం తీర్పు – 'ఈ బ్రాహ్మడు పొలం చెయ్యటం, ఆ శూద్రుడు పౌరోహిత్యం చేయించటం, వీడు పొలం చేస్తే వచ్చే ధాన్యమూ అవ్వీ, ఆ శూద్రుడి కిచ్చేయ్యటం. వాడు పౌరహిత్యం చేస్తే వచ్చే బియ్యమూ, కాన్లూ ఈ బ్రాహ్మడికి యిచ్చెయ్యటం.' ఇది ఒక మోస్తరు తీర్పు.

రెండవరకం తీర్పు – 'ఎట్లాగంటే వినండి వీడు సగం పౌరోహిత్యం, వాడు సగం పౌరోహిత్యం – వీడు సగం పొలం, వాడు సగం పొలం చేసుకోటం. ఇది తేలిక...' అని 'ఈ మాత్రం తేలికపనికి ఇంత హడావిడా? దానమ్మ కడుపుకాల!' అన్నాడు.

సభంతా జయజయధ్వానాలు చేశారు. వాళ్ళిద్దరూ రెండో తీర్పు ప్రకారం నడుచుకుంటామన్నారు.

తరువాత 'రాజు' ఉన్న వ్యాజ్యాలన్నీ సులువుగా తీర్పులు చెప్పాడు. 'సూత్రం ఇల్లాగోయి' అని చెప్పి తన ధర్మాధికారులకు అప్పజెప్పాడు. వారూ 'రాజు' చెప్పినట్లు చేస్తున్నారు. ఎవడు ఎన్ని ఎక్కువ వ్యాజ్యాలలో తొందరగా

తీర్పులు చెప్పి పంపిస్తే వాడు మొగాడు ఆ రాజ్యంలో. వాడికి 'రాజు' తత్త్వం బాగా తెలిసినట్లు.

'రాజు' రాజ్యం ఆ దేశంలో ఇల్లా అవ్యాహతంగా సాగుతోంది.

ఎవడైనా ఎప్పుడన్నా రాజుతో 'మీ ముత్తాతగారు సుధర్ముడని వుండేవారట. వారి కాలంలో వ్యాజ్యమంటూ లేదట, అని చెబితే రాజు అవి అన్నీ కల్లబొల్లి మాటలోయి. మా ముత్తాత అనేవాడు అసలు లేడు. ప్రపంచమంతా మానాన్నతో మొదలుపెట్టి వుండాలి. నేనెఱిగినప్పటి నుంచే ప్రపంచకం అసలు కన్ను తెఱచింది. ఆ సంగతి నాకు తెలుసు" అంటాడు. అందరూ వూరుకుంటారు. వాళ్ళూ నిజమే అనుకుంటున్నారు. ఒక రోజున యెవడో కాదంటే రాజు వాణ్ణి ఉరితీయించాడు.